# ఓర్వలేని దైవం

వర్షపుహోరు! ఉరుములు! గాఢాంధకారాన్ని చీల్చుకుంటూ దూసుకుపోతున్న మెరుపులు.

"ప్లీజ్! మీరు ఇప్పుడు ప్రాజెక్టుమీదికి వెళ్ళొద్దు, ఈ ఉరుములు, ఈ వాన, నా కేమిటో తగని భయంగావుంది." శ్రీదేవి కంఠస్వరంలో అభ్యర్థనేకాదు, ఆజ్ఞకూడా నిండివుంది. తనను చుట్టివేసివున్న శ్రీదేవిని మెల్లిగా విడిపించుకుంటూ మృదువుగా నవ్వాడు శ్రీనివాస్. "మొత్తానికి అబలవనిపించుకున్నావ్! లేకుంటే ఉరుములకూడా భయపడాలా?" "అబలనో, సబలనో, మీరుమాత్రం ఈ రాత్రికి ఇల్లుకదలటానికి వీల్లేదు. మీ ప్రాజెక్టు ఏమీ అయిపోదు తెల్లారేసరికి!" సగంకోపం, సగంప్రేమా, మరి కాస్తంత వ్యంగ్యం కలగాపులగంగా వున్నాయి శ్రీదేవి మాటలలో.

పకపక నవ్వాడు శ్రీనివాస్. "బంగారుదేవీ! ప్రాజెక్టుదగ్గర ఇలాటి సమయాలలో నే లేకుండ, సూపర్‌వైజర్ సదాశివం, లస్కర్లు, హాయిగా వెచ్చగా నిద్రపోయారంటే, షట్టర్స్ తియ్యకుంటే, తెల్లారేసరికి ప్రాజెక్టే కాదు, చుట్టుపక్కల కొన్ని గ్రామాలుకూడా మిగిలివుండవు!"

"ఓహ్! కుంటిసాకులు! షట్టర్స్ ఈరాత్రంతా ఎత్తేసేవుంచమని చెప్పిపంపండి. పీడా వదలిపోతుంది!" అసహనంగా అరిచిందిశ్రీదేవి.

"ఈ వర్షంకాస్తా ఆగిపోయిదంటే, తీసివుంచినషట్టర్స్‌లోంచి, నిల్వ వున్న నీళ్ళుకూడా పారిపోయాయంటే, రేపు ఉదయం నా ఉద్యోగం పోవటం మాటెలా ఉన్నా, సంవత్సరాంతం ఈ నీటిని నమ్ముకుని వుండే రైతుల ఘోషకు ఏం సమాధానం చెప్పమన్నావ్?"

శ్రీదేవి కొరకొర చూచింది.

"బంగారుదేవీ! నేనేదేనా కాంప్‌కు వెళ్ళాననుకో లేదా నువ్వు మీ పుట్టింట్లోవున్నావనుకో. ఈ ఒక్కరాత్రీ....ప్లీజ్! వారించకు మళ్ళీవర్షం ఎక్కువయ్యేలావుంది. అరె! రెయిన్‌కోటు దాచెయ్యకు. రేపొద్దున నీ మొగుడికి జబ్బుచేస్తే నువ్వే ఏడవాలి!"

నవ్వుతూ రెయిన్‌కోటు లాక్కుని, పవర్‌ఫుల్ టార్చి తీసుక, మెరుపులా దూసుకువచ్చాడు శ్రీనివాస్. కోపంతో శ్రీదేవి తలుపు దఢాలున వేసుకుంది.

పిచ్చి శ్రీదేవి! ఆమెకేంతెలుసు? ఈ ప్రాజెక్టుమీద తనకింత మక్కువెందుకో?

తన కన్నబిడ్డ దిక్కులేకుండా పడిఉన్నసంగతి, సకాలంలో తెలుసుకుని, సరైన వైద్యం చేయించి, బిడ్డను దక్కించుకోగలిగిన తండ్రిలో ఎలాటి గర్వం ఆనందం కలుగుతాయో, సరిగ్గా తనలో అలాటి ఆనందమే నిండి వుందీనాడు.

నైతికవిలువలు, ప్రాజెక్టులు కట్టినంత త్వరగా కూలిపోతున్నట్టు, కొండమీదిరాయి జారి అగాధాలలోకి జారిపోతున్నంత త్వరగా మనుషుల్ని ఏ రాతియుగంలోకో విసరివేస్తున్నట్టుంటే; తనూ ఆ ప్రలోభంలో పడి కొట్టుకుపోకుండా, నిలదొక్కుకోగలిగానన్న ఆనందం తన కెక్కడలేని ఉత్సాహాన్నీ, ఆత్మ సంతృప్తిని కలిగిస్తోంది!

అంచేతే ...ఎత్తుగా, హుందాగా, అందంగా నిలబడిఉన్న, ఆప్రాజెక్టు చూస్తున్నా, దానిమీద నడుస్తున్నా, తనకెక్కడలేని ఆనందమూ, ఉత్సాహమూ, కలుగుతాయి.

జీవితంలో చాలా ఘనకార్యాలు తను చేయలేకపోవచ్చు .... చేసిన ఈ ఒక్కటైనా చిత్తశుద్ధితో సాధించ గలిగానన్న సమాధానం తన మనసుకు హాయి కలిగిస్తోంది. ....

రివ్వున చలిగాలి వీస్తోంది.... మఫ్లర్ తలకూ, మెడచుట్టూరా చుట్టుకుని నడకవేగం హెచ్చించాడు శ్రీనివాస్.

ఆలోచనలు సుడులు తిరుగుతూ గతంలోకి చొచ్చుకుపోతున్నాయి.

*　　　　*　　　　*　　　　*

" నీలకంఠంగారూ ! ఏమిటది ? మీరేం చేస్తున్నారు ? "

తన వెనుకాల సింహగర్జన విని, ఒక్కసారిగా హడలిపోతూ వెనుదిరిగి చూశాడు నీలకంఠం.

ఫుల్ డార్క్ బ్లూసూటులో ఆజానుబాహుడైన శ్రీనివాస్ అపర రుద్రునిలా నిల్చునివున్నాడు ! క్షణకాలం, చప్పున నోటిమాట పెగలనంతటి నిర్జీవస్థితిలో పడిపోయాడు నీలకంఠం.

" ఏమిటి మీరుచేస్తున్నది ? " మళ్ళీ అదే గర్జన.

" సిమెంటు, ఇసుక .... కూలీలచేత కల్పిస్తున్నానండీ ! "

" అది తెలుస్తూనేఉంది. కానీ ఏడుపాళ్ళు ఇసుకా, ఒకపాలు సిమెంటూనా ? ఎక్కడనేర్చారీవిద్య ? దిమ్మెలు, అందునా ప్రాజెక్టు స్థంభాలు కట్టేటప్పుడు ఉపయోగించే సిమెంటుపాలు అదా ? "

నీలకంఠం వెర్రిమొగం వేశాడు. మరుక్షణంలో రానినవ్వు పెదాల మీద రుద్దుకున్నాడు : " నేను మీకిరింది కంటా్రిక్టర్ని. అయినావయసులోనూ, అనుభవంలోనూ, పెద్దవాణ్ణి. నా మాట కాస్త మన్నించండి. ఇలాటి విషయాలలో మీరు తరచూ తలదూర్చకండి ! చేతులు నలుపుకుం

టూనే సలహా యిచ్చాడు నీలకంఠం. "అంటే ?" కోపంగా అరిచాడు శ్రీనివాస్.

"అంటే ! వివరంగా చెబుతాను. ఇలాగే ఎన్నోచోట్ల చేస్తారు. చేస్తారేమిటి ? చేస్తున్నారు. అందాకా ఎందుకు ? పోయినమారు ప్రసాదరావు గారనే ఇంజనీరు ప్రమోషన్‌మీద బదిలీఅయి వెళ్ళిపోయారు. మీకు గుర్తుందికదూ ? వారికిక్రింద దాదాపు ఎనిమిదేళ్ళు కంట్రాక్టరుగా పని చేశానునేను ! కానీ మహానుభావులు ! ఎంతదూరాన వున్నారో ఏమిటో ? క్షణక్షణమూ నామీద ఇలా అజమాయిషీ చేసేవారుకారు; ఉద్యోగానికి వచ్చిన పదిహేనేళ్ళల్లోనూ ఆయనగారు రెండు పెద్ద బంగళాలు కట్టించుకున్నారు. వారి నీడలో నేనూ ఓ రెండు పెంకుటిళ్ళు కట్టించుకున్నాను."

శ్రీనివాస్ నిర్ఘాంతపడిపోయాడు ! ఏమిటి నీలకంఠం ఉద్దేశ్యం ?

"మీకు తెలియదు." నీలకంఠం మళ్ళీ మొదలెట్టాడు. "వయసూ, వివేకమూ, అనుభవముకూడా తక్కువే ! ఇలా అంటున్నానని కోప్పడకండి. మా పెద్దవాడూ మీలాంటివాడే ! ఆదర్శాలు .... ఆదర్శాలు అంటూ జపం చేస్తూ నేను చచ్చిచెడి వాణ్ణి ఇంజనీరింగు చదివించాననే జ్ఞానమేనాలేకుండా, దమ్మిడీకట్నం పుచ్చుకోకుండా పెళ్ళాడేశాడు. అంతేకాదు ఉద్యోగంలో ఎర్రని ఏగానీ పైన సంపాదించుకోవటం చేతకాదు. ఆ చాలీచాలని జీతంరాళ్ళతోనే ఎక్కడో దూరదేశాన మగ్గిచస్తున్నాడు. పోనీద్దురూ వాడి గొడవ ఇప్పుడెందుకు ? ఇంతకూ చెప్పొచ్చేదేమిటంటే, దీపం వున్నప్పుడే ఇల్లుచక్కబెట్టుకోమన్నారు పెద్దలు. మీరు చూచీ చూడనట్లూరుకోండి. మీకు రెండుకట్టల సిమెంటు అయితే, నాకు అరకట్ట ! ఈనిష్పత్తిలోనే సిమెంటురేకులు, ఇనుపచువ్వలు, టేకుసామాను, కంకర కూడా వస్తాయి."

అభిప్రాయం తెలుసుకోవటానికి ఆగాడు నీలకంఠం....

నీలకంఠం మాటలు వింటూ అతగాడివేపు ఆశ్చర్యంగా చూస్తుండి పోయాడు శ్రీనివాస్.

ప్రాజెక్టులకోసం ప్రభుత్వం శాంక్షన్‌చేసిన ఈ డబ్బు ! ఇదెవరిది? ఎందరో రైతులది ! మరెందరో పౌరులది ! ప్రత్యక్ష, పరోక్షపన్నుల రూపంలో ప్రజలనుండి వసూలుచేయబడిన ఈసొమ్ము ఎలా దుర్వినియోగ పరుపబడ్తోంది ? ప్రాజెక్టులు కడ్తున్నారంటే, వాటిక్రింద తమ భూముల్లో బంగారం పండించవచ్చని ఎన్నో బంగారు కలలుకనే రైతులు, పాజెక్టు ప్లాన్ తయారుఅయ్యీ కాకముందునుంచే, ఇక ఆ ప్రాజెక్టుక్రింద ఎన్ని వేల ఎకరాలు సాగుచేయవచ్చో లెక్కలుకట్టి, ముందస్తుగానే అంతమేరకూ అప్పుతెచ్చే, ఆర్థిక శాస్త్రవేత్తలూ....ఓహ్ ! అందరి కలలూ మన్నులో కలిసిపోయేలా, ప్రవాహంలా సాగిపోతున్న ఈ అవినీతి ? ఇది ఎక్కడ మొదలై ఎక్కడ అంతమౌతుంది ? మనుషుల్ని, ఏ అగాధాలలోకి ఏరాతి యుగంలోకి, త్రోసివేస్తోంది ? నైతిక విలువల్ని ఏసమాధులలో పూడ్చి వేస్తోంది ? ఈ నీలకంఠంలో ....ఈ నీలకంతాలలాటి మరెందరిలోనో, బహుశార క్తమూ, మాంసమూ, ఎముకలూ కాకుండా స్వార్థమూ,అవినీతి, పరవంచనా, ఆత్మవంచనామాత్రమే వున్నాయేమో ?

"పోనీ మీకు కష్టం కలిగేట్లయితే" నీలకంఠం మాటలతో త్రుళ్ళి పడ్డాడు శ్రీనివాస్.

"నా వాటా పాతికవంతుకు. అంటే మీకు ఒకటైతే నాకు అందులో నాలుగోవంతుకు దించుకుంటాలెండి. మా అమ్మాయికీ, అల్లుడుకీ మరో మారు కట్టిస్తానుఇల్లు !" గొణుక్కుంటున్నట్లుగా అన్నాడు నీలకంఠం.

"అవసరంలేదు...." తాపీగా అన్నాడు.

క్షణకాలం నీలకంఠం కళ్ళలో మెరుపు !

"మీ వాటా, నా వాటా, రెండూకలిపి జాగ్రత్త చేస్తాను."

"నే చెప్పినట్లు చెయ్యాలి." శ్రీనివాస్ కంఠస్వరం ఎంత మృదువుగా వుందో, అంతటి ధృఢంగానూ వుంది.

నీలకంఠం తలూపాడు.

"రేపట్నుంచీ కూలీలతోబాటు నేనూ పనిలోకివస్తాను. సిమెంటు నా ఎదురుగా కలపాలి. కానీ ఒకటి, ఏడు నిష్పత్తితోకాదు! ఊకుసామాను నేనే నిర్ణయిస్తాను. కంకరయూనిట్లుకూడా జాగ్రత్తగా విడదీసి మరీ కొలుచుకుంటాను, లోపల గుల్లరాయిలేకుండా...."గిరుక్కున వెనుదిరిగి వెళ్తున్న శ్రీనివాస్, తనవెనుక నీలకంఠం తాలుకు అగ్ని గోళాల్లాటి కళ్ళు, తనను నిలువెల్లా భస్మం చేస్తున్నట్లు తెలుసుకొని, తనలో తనే నవ్వుకున్నాడు చిన్నగా!

* * * * *

ప్రాజెక్టుదిమ్మెలు పూర్తయ్యాయి....రోడ్డుకూడా దాదాపు పూర్తిగా వొస్తోంది! కాని హఠాత్తుగా శ్రీనివాస్‌కు డిజైన్స్ సెక్షన్‌లోకి మార్పు వచ్చింది. అక్కడే! నిర్ఘాంతపోయాడు శ్రీనివాస్ ఆర్డరు కాగితం చదువుకు!

తను రోజూ వేళతప్పకుండా, జాప్యం లేకుండా ప్రాజెక్టుపని తన స్వంత పనికన్నా ఎక్కువగా, కరెక్టుగా చూచుకుంటున్నాడుగదా? మరి తనకెందుకిలాటి మార్పు ఇచ్చారు? ఆ మాటే అడిగాడు ఎక్జిక్యూటివ్ ఇంజనీరు వెంకటేశ్వర్రావును!

అతగాడు చిరునవ్వునవ్వాడు. "ఎందుకోయ్ శ్రీనివాస్! లేనిపోని బాధ నీకు? హాయిగా ఆఫీసులో నీడపట్టున కూర్చుని చక్కగా డిజైన్సు వేసుకో!"

చిలకత్తావిటినారాయుడు



అదొక్కటే కారణంకాదు .... తన సెక్షను మార్పు వెనకాల, కంట్రాక్టర్ నీలకంఠం కోపం, సూపర్‌వైజర్ సదాశివం అక్కసూ, లస్కర్స్ పెంచలయ్యా మస్తాను వగైరాల ద్వేషం.... తెర మరుగుగా వున్నాయని తెలుసుకోటానికి ఎంతోసేపు పట్టలేదు !

సంవత్సరం తిరిగేసరికి ప్రాజెక్టు పూర్తయింది....మళ్ళీ ప్రాజెక్టు మీదే సబ్‌డివిజన్ సెక్షన్‌కు మార్పువచ్చింది....

అయినా ఆ ప్రాజెక్టునుచూస్తే తనకేమిటో తగని మక్కువ....

* * * * *

"నమస్కారం సార్ !"

గొంతులువిని ఉలిక్కిపడ్డాడు శ్రీనివాస్. రెయిన్‌కోట్లలో, టార్చి వెలుగుల్లో లస్కర్స్ నలుగురూ, సూపర్‌వైజర్ సదాశివం ! గతస్మృతులను వెనక్కు నెట్టేశాడు.

"ఊ ! గేజ్ చూశారా ?"

"ఊ !" సదాశివం సమాధానం....

"పదండి మరోమారుచూద్దాం. డైనమో పనిచేస్తోందా ? షట్టర్స్ కప్పీలు సరిగా వున్నాయికదా ? వాటర్‌ఫోర్స్ ఎక్కువయ్యేలావుంది. కంటిమీద కునుకును గురించి ఆలోచిస్తే లాభంలేదు !" గబగబ నడుస్తున్నాడు శ్రీనివాస్.

పైకితిట్టలేని అశక్తతతో, కోపంగా అనుసరిస్తున్నవారి దీవెనలు తనకు తెలుసు ...

ఆ మధ్య ఓసారి ఇలాగే వర్షంగావుంటే, వరదవచ్చే సూచనలు కన్పిస్తే, ప్రాజెక్టుమీదకు రమ్మంటూ సూపర్‌వైజర్‌కు కబురంపాడు తను....

"ఓహ్ ! ఏం ఇంజనీరురా బాబూ ? ఈ వర్షంలో, చలిలో, చక్కగా భార్య కౌగిలిలో, వెచ్చగా పడుకోవటం చేతగాక.... పైగా అలా సుఖం అనుభవించే మనల్నికూడా ప్రాణాలు తోడేస్తున్నాడు! వీడూ, వీడి రూల్సూను !" అంటూ చెప్పటానికి వెళ్ళినవాళ్ళముందు చిందులుతొక్కిన సదాశివం....ఎదుట తనుపడే సరికి, పిల్లిలా అనుసరించివచ్చాడు; బహుశా ఇప్పుడూ అంతే !

"అరె F. R. L. దాటినట్లుంది నీళ్లు ! షట్టర్స్ ఎత్తి ఓ ఆరడుగులు నీళ్ళు వదిలి, తిరిగి షట్టర్స్ వేసెయ్యండి. తర్వాత చూద్దాం !"

"సాయంత్రంనుంచీ డైనమో సరిగా పనిచెయ్యటం లేదండీ !" సదాశివం గొణిగాడు....

"అరె ! మరి నాకెందుకు చెప్పలేదూ ?"

"ఎవరుమాత్రం చేయగలిగిందేముంది ఈ వర్షంలో ?" ఓవిధమైన నిరసన వ్యక్తమయ్యింది సదాశివం కంఠస్వరంలో !

"ఊ ! ముందస్తుగా నీళ్లువదలండి...."

లస్కర్ చేతికండరాలు మెలి దిరుగుతున్నాయి. బరువుగా వీల్ తిరుగుతోంది. షట్టర్స్ కొద్ది కొద్దిగా పైకి లేస్తున్నాయి ! హోరుమంటూ సుడులు తిరుగుతూ, నురగలు గ్రక్కుతూ, పరుగెడ్తున్నాయి నీళ్ళు, బందిఖానా నుంచి విడుదల పొందిన నిరపరాధిలా !

"వెల్ పదండి రూంలో కూర్చుందాం !"

ప్రాజెక్టుపై అంతస్థుకు చేరేందుకుగాను ఏర్పరిచిన మెట్ల తాలూకు చిన్నగది అది. ఒకేఒక వాలుకుర్చీ, ఓస్టూలు, ఈతాకులచాప.

వాలు కుర్చీలోవాలాడు శ్రీనివాస్-సదాశివం స్టూలుమీదకూర్చున్నాడు. లస్కర్స్ నలుగురూ చాపమీద కూర్చున్నారు.

హోరుమంటూ కురుస్తున్నవాన.... సిమెంటురేకులమీద మరింతగా శబ్దం చేస్తోంది.

"అబ్బబ్బ ! వెధవ్వానలండీ ! హాయిగా పోయిన ఏడాదిలా వర్షం లేకుండావుంటే, ఎంతబావుణ్ణు !" సదాశివం చేసేదిలేక గొణుక్కుంటున్నాడు.

పకపక నవ్వాడు శ్రీనివాస్. "అలా అనకండి.... పాపం ! పోయినేడాది వర్షాలులేక, పంటలులేక, జనం ఎంతగా మాడిపోయారో గుర్తు లేదల్లే వుందిమీకు ! అసలు మనకిలా జీతాలిస్తున్న దెందుకంటారూ ? వెచ్చగా, ఇళ్ళల్లో పడుకుని నిద్రపోవటానికా? ఉహూఁ ! మనవిధి మనం నిర్వర్తించటానికి ! వర్షాలు కురవక, జనం మలమలమాడిపోయే పరిస్థితుల్లో మనకు ఉద్యోగాలు మాత్రం ఎందుకు ?" సుతారంగా చురక అంటించి, సిగరెట్ వెలిగించాడు శ్రీనివాస్. మరు నిముషంలో ఏదో గుర్తుకొచ్చినట్లు, "సదాశివంగారూ ! మీరూ వెలిగించుకోండి ! మనలో మనకేగానీ ఈ హోదాలతేడా, ప్రకృతికి అలాటి పక్షపాతమేంలేదు చూడండి ! అందర్నీ ఒక్కలానే గడగడ లాడించేస్తోంది! పెంచలయ్యా! మీరుకూడా చుట్టలు ముట్టించుకోవచ్చు.... నేనేమీ అనుకోను !"

ఆ మాట పూర్తికాకముందే దూరాన ఎక్కడో పిడుగుపడింది. ఆశబ్దానికి ప్రాజెక్టుకూడా క్షణకాలం దడదడ లాడినట్లయ్యింది !

శ్రీదేవి ఎలావుందో ? పాపం భయపడ్తోందికాబోలు! ఓహ్! భయపడితే పడనీ ! తను ఆసాకుతో తన కర్తవ్యాన్నుంచి పారిపోలేడు ! "మరోసారి గేజ్ చూచి రావాలి !" లేవబోయాడు శ్రీనివాస్.

"మీరెందుకులెండి ! మేం వెళ్ళి చూచొస్తాం" సదాశివం వారించాడు. అతగాడి కళ్ళల్లో "హూఁ! ఎలాగూ మేమూ సుఖపడడం లేదుగా సీమూలాన్ని !" అనే కోపం బుసలు కొడ్తున్నట్లు తోచింది....

"రాండోయ్ వెళదాం!" లస్కార్స్‌ను వెంటబెట్టుక, మెల్లెక్కి వెళ్తున్న సదాశివం అడుగులా కొయ్యమెట్లమీద, తనని తొక్కి వేయా అన్నంత కసిగా, పడ్తున్నట్లు అనిపించింది శ్రీనివాస్‌కు .... లోలోపల నవ్వుకున్నాడు! సగటు మనిషికి బాధ్యత నిర్వర్తించాలన్నా,నియమంపాలించాలన్నా అందుకై కాస్త శ్రమపడవలసివచ్చినా, ఎందుకింతటి విముఖత! బహుశా బాధ్యతారహితునిగా తిరగటంలోనూ, నియమోల్లంఘన చెయ్యటంలోనూ, శారీరక, మానసిక శ్రమలు ఏమాత్రం కలుగకుండా వుండటంలోనూ మాత్రమే, మనిషికి ఆనందం కలుగుతుందేమో?

ఆలోచిస్తున్న శ్రీనివాస్ కళ్లు అరమోడ్పులయ్యాయి... హఠాత్తుగా చెవులు దిబ్బళ్లుపడే శబ్దం.... కళ్లు చీల్చుకుపోయే వెలుగు! అదిరిపడి కళ్లు తెరచి చూశాడు....మళ్ళీ ఎక్కడో పిడుగు పడిందల్లేఉంది! టైం చూచుకున్నాడు! రాత్రి ఒకటిన్నర దాటింది! అరె! తాను ఓ అరగంట నిద్రపోయాడు! మరివీళ్లేరీ? ఇంకా ఏం చేస్తున్నారక్కడ?

హోరుమంటున్నవర్షం మిన్నూ మన్నూ ఏకంచేస్తోంది! గబగబ టార్చితీసుక పైకివెళ్లాడు శ్రీనివాస్. ఎక్కడా, మనుషులున్న జాడ కనిపించటంలేదు!

"ఏమైపోయారు వీళ్ళంతా?" టార్చిలైటువెలుగు ప్రసరించినంత మేరా, నీటి ప్రవాహంతప్ప మరోటి కన్పించడంలేదు! "ఇళ్ళకువెళ్ళి పోయారా?" హఠాత్తుగా కలిగిన 'ఊహతో' ఒళ్ళు జలదరించినట్లయ్యింది శ్రీనివాస్‌కు!

వాటర్‌గేజ్ చూశాడు. కళ్లు బైర్లు కమ్మినంత పనైంది. టార్చి వెలుగులో ప్రాజెక్టు క్రిందిభాగం అంతా నీళ్లసుడులు తిరుగుతున్నాయి!

డైనమో సరిగా పనిచేయటంలేదు! లస్కార్స్, సదాశివం వెళ్ళి పోయారు?

తనని మోసంచేసారు ! తనమీద కసి ఇలా తీర్చుకున్నారా ?

"సదాశివం !" ఘట్టిగా అరిచిన తనకేక తనకే వినిపించనంతటి వర్షపు హోరు !

క్షణకాలం అయోమయావస్థలో పడిపోయాడు శ్రీనివాస్ ! ప్రాజెక్టుకు ఒకటిన్నర మైలు దూరములో తమ క్వార్టర్స్ ! వెళ్ళే టైంలేదు !

మరుక్షణంలో ఏదో ధృఢనిశ్చయం కలిగింది ! టార్చి పక్కన పెట్టి, షట్టర్స్ ఎత్తేందుకు, వీల్ తిప్పనారంభించాడు ....

చేతులు నొప్పెడుతున్నాయి ! వర్షం హోరుమంటోంది .... దూరాన్నుంచి, నల్లగా నురగలు గ్రక్కుతూ నీటిప్రవాహం ! మెల్లగా, అతి మెల్లగా షట్టర్ లేస్తోంది... ఇలా ఓ గంట కష్టపడితే, మిగతావి కూడా లేపొచ్చు....నీళ్ళు అవతలికి వెళ్ళిపోతే, ప్రెషర్ తగ్గుతుంది .... చెమటలు కారుతున్నాయి అంతటి చలిలోనూ ....

ఫెళఫెళ .... మిన్నువిరిగిపడ్డట్లు శబ్దం ! మరుక్షణంలో శరీరం తేలికౌతున్నట్లు అనుభూతి....చుట్టూరా నీళ్లు....ఉయ్యాల ఊగుతున్నట్లుంది శ్రీనివాస్‌కు ....

నురగలు గ్రక్కుతున్న గంగమ్మతల్లి, శ్రీనివాస్ కళేబరాన్ని తన ఎదలో దాచుకుని సాగిపోతోంది....కూలిపోయిన ప్రాజెక్టు పైఅంతస్తు తాలూకు భాగాలు, నీటిమీదతేలుతూ, మునుగుతూ, మానవనైతిక విలువలకు మారురూపుల్లా వున్నాయి ! శ్రీనివాస్‌దగ్గరుండి, స్వయంగా కట్టించిన మొదటి అంతస్తుతాలూకు దిమ్మెలు .... చివరి క్షణంవరకూ అతగాడు పడినశ్రమ, ఆవేదనలకు గుర్తుగా నిలిచిఉన్నాయి....“ నీతి, నిజాయితీలు, సమపాళ్ళలో వుండే మనుషుల్ని — వారి మనుగడల్ని, నేనుకూడా చూస్తూ

ఓర్వలేనుసుమా !" అని దైవం అంటున్నట్లు, నింగినుండి నేలకు మెరుపురేఖలూ, ఉరుములూ ఉధృతంగా సాగుతున్నాయి ....

మర్నాడు .... ప్రకృతి భీభత్సం అణగారింది ....

శ్రీనివాస్‌లాటి ఆదర్శయువకుని మరణం తాలూకు సంతాపసభ జరుగుతోంది!

నీలకంఠం కన్నీళ్లు కారుస్తున్నాడు. సదాశివం గుండెలు బాదుకుంటున్నాడు....ఎన్నో వార్తాపత్రికలు అతగాడి కుటుంబానికి సానుభూతి ప్రకటించాయి ....

(" విశ్వరచన ")